# మహిళా సాధికారత దిశగా ఉచిత ప్రయాణం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- మహిళలు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

తెలంగాణచౌక్, డిసెంబర్ 9: మహిళలకు రక్షణ కల్పించడంతోపాటు మహిళా సాధికారతను సాధించే దిశగా ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని శనివారం ఆమె ఆర్టీసీ అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వయసుతో సంబంధం లేకుండా బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఏ ప్రాంతానికైనా ప్రయాణం చేయవచ్చని తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే మహిళలకు జీరో చార్జీ టికెట్లు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణం సదుపాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ట్రాన్స్‌జెండర్లను ఆర్టీసీ డ్రైవర్లుగా నియమిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారికి డ్రైవింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన నుంచి బస్సులో మహిళలు, ట్రాన్స్‌జెండర్లతో కలిసి కలెక్టర్ పమేలా సత్పతి కోర్టు చౌరస్తా, గీతాభవన్ మీదుగా బస్టాండ్ వరకు ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మాధవి, డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డి, డిపో-1, 2 మేనేజర్లు మల్లేశం, మల్లయ్య, ఏటీఎం రజనీకృష్ణ, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కలెక్టరేట్, డిసెంబర్ 9: అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ జనసత్తా రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధి డా.ముదుగంటి సుధాకర్‌రెడ్డి కోరారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం కార్యాలయంలో సెమినార్ నిర్వహించారు. అవినీతి నిర్మూలనలో పౌర సమాజం' అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలుతున్నదని, మేధావులు, దేశ రక్షకులు కలిసికట్టుగా ముందుకు సాగితేనే దీనిని నిర్మూలించవచ్చన్నారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ, సమాజంలో నైతిక విలువలు పతనమై ప్రతిచోటా అవినీతి విస్తరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి నిర్మూలన చట్టాలను పకడ్బందీగా అమలు చేసి, పాలనాపరమైన సంస్కరణలు చేపట్టే దిశగా ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు తంగెడ నవనీతరావు, భూంపల్లి మోహన్ రెడ్డి, ముదుగంటి దామోదర్‌రెడ్డి, నన్నపనేని గిరిబాబు, సత్యనారాయణరెడ్డి, మనోహర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న సంఘం నాయకులు

## గుర్తింపు కార్డుల పంపిణీ

చొప్పదండి, డిసెంబర్ 9: పట్టణంలోని చేనేత సహకార సంఘంలో పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు మచ్చ రమేశ్, పట్టణాధ్యక్షుడు దండె రాజయ్య ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు జిల్లా శాశ్వత సభ్యత్వ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ ఇప్పనపెల్లి సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణహరి, మండల గౌరవాధ్యక్షుడు గాజంగి రాములు, జిల్లా కార్యదర్శి ఎన్నం మునీందర్, మండల ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి రమణయ్య, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు అనుమండ్ల నర్సయ్య, గాజంగి మల్లేశం, పారండ్ల శ్రీనివాస్, వంగ నరేశ్, సామల శ్రీనివాస్, ఎలిగేటి మల్లేశం, ఎన్నం మనోహర్, దూస రమేశ్, అలుస లక్ష్మీనారాయణ, వొల్లాల నగేశ్, సిరిపురం శ్రీనివాస్, గుండ నర్సయ్య, కల్యాణపు శ్రీనివాస్, దూస సతీశ్, బోగ లక్ష్మణ్, ప్రసాద్, అలిశెట్టి ఇస్తారయ్య, బిల్లా రమేశ్, పచ్చునూరి లక్ష్మీపతి, దూస మురళి, గుడిమల్ల భూమేశ్, చిందం భూపతి, పోలు రవి, కుల బాంధవులు పాల్గొన్నారు.

## వేగంగా ధాన్యం కొనుగోళ్లు

గంగాధర, డిసెంబర్ 9: గంగాధర వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ దూలం బాలాగౌడ్ తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రైతుల నుంచి 90 వేల క్వింటాళ్లను కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు తెలిపారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, వరుస క్రమంలో ధాన్యం కొనుగోలు చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట సింగిల్ విండో సిబ్బంది, రైతులు ఉన్నారు.

## దివ్యాంగుల అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, డిసెంబర్ 9: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో రాణిస్తున్న వ్యక్తులు, సంస్థలను గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డులు ప్రదానం చేస్తామని, ఇందుకు అర్హులైన దివ్యాంగులు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సరస్వతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్ wdsc. telangana. gov. inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డీడబ్ల్యూవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ శ్రీనివాస్ సెల్ నంబర్ 86390 40488లో సంప్రదించాలని వెల్లడించారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, డిసెంబర్ 9: నగరంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల విద్యార్థి బాబూరావు సౌత్, ఈస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఎండీ సర్వర్ పేర్కొన్నారు. ఇటీవల శాతవాహన యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ గేట్ ఫుట్‌బాల్ సెలక్షన్స్‌లో పాల్గొన్న బాబూరావు అద్భుత ప్రతిభ కనబరిచి ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం యేనిపోయా యూనివర్సిటీలో జరిగే సౌత్, ఈస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు అర్హత సాధించాడు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బాబూరావును ప్రిన్సిపాల్ లావణ్య, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.



బాబూరావును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

# ఎమ్మెల్సీ పదవికి పాడి కౌశిక్ రెడ్డి రాజీనామా

- ఆమోదించిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్, డిసెంబర్ 9: హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పాడి కౌశిక్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేశారు. కాగా, తన రాజీనామా పత్రాన్ని మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి ఆమోదించినట్లు తెలిపారు. తను శాసనసభ సభ్యుడిగా చివరి శ్వాస వరకు హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు.




రాజీనామా లేఖను శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి

# రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



రిటైర్డ్ ప్రిన్సిపాల్ నీలం సంపత్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 9: నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో 'రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్' హైదరాబాద్ ఆధ్వర్యంలో శనివారం రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ డైరెక్టర్ విజయ్‌పాల్ రెడ్డి, ముఖ్యవక్తగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్ హాజరై విద్యార్థినులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రమాదల నివారణకు పాటించే మెలకువలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సమత, లైబ్రేరియన్ మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్బీఎస్ మండల కన్వీనర్‌కు పరామర్శ



రంగమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 7: కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో ఆర్బీఎస్ మండల కన్వీనర్ కాశెట్టి శ్రీనివాస్ తల్లి రంగమ్మ ఇటీవల మృతిచెందారు. కాగా, కాశెట్టి శ్రీనివాస్‌ను శనివారం బీఆర్ఎస్ కరీంనగర్ రూరల్ మండల నాయకులు పరామర్శించారు. రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు వరాల శ్రీనివాస్, బొమ్మకల్ ఎంపీటీసీ వెంగలదాసు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శెట్టి జగన్‌పటేల్, సింగిల్ విండో డైరెక్టర్ మాదాసు వెంకన్న, భాస్కర్‌రెడ్డి, సదానందం, లక్ష్మయ్య, తదితరులున్నారు.

## రేపటి నుంచి ప్రజావాణి

కలెక్టరేట్, డిసెంబర్ 9: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకునేందుకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి పునః ప్రారంభం కానుంది. ఈ మేరకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎప్పటి మాదిరిగానే ప్రజావాణిని తిరిగి ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో ఈనెల 11వ తేదీ నుంచి తిరిగి ప్రజావాణి నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమై ఉండగా, ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ప్రజావాణి తాత్కాలికంగా రద్దు చేశారు. ఎన్నికలు ముగియడంతో ఎలక్షన్ కమిషన్ కోడ్ ఎత్తేసింది. దీంతో ప్రజావాణి తిరిగి నిర్వహించేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

**టెండర్ ప్రకటన**

KITS College సింగాపూర్ హుజురాబాద్ తేది: 12-12-2023 నుండి 21-12-2023 వరకు NCC క్యాంపులో Grocery: బియ్యం, పప్పు, మసాల దిన్సులు కూరగాయలు సప్లై చేయుటకై టెండర్లు కోరడమైనది. ఆసక్తి గలవారు తమ కొటేషన్‌ను CO 9(T) బెటాలియన్ పేరిట 10 Dec 2023 వరకు ఇవ్వవలసినదిగా కోరడమైనది. చిరునామా: **NCC Office, Near, D-Mart Road, Karimnagar Cell: 9596761776**